

మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లవెల్లి అంజిరెడ్డి తదితరులు

ఘనంగా మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవం

ముషీరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బాకారంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లవెల్లి అంజిరెడ్డి ఆధ్వర్యంలో మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మల్లికార్జున్‌రెడ్డి, బాకారం భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవాలయ మాజీ చైర్మన్ ఎన్ ఊర్మిళ, దేవాదాయ శాఖ ఈవోలు సత్యనారాయణ, రఘు, సిబ్బంది సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ వెళ్లిన కాంగ్రెస్ ముషీరాబాద్ నేతలు



ఢిల్లీ వెళ్లిన ఆలిండియా కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ కార్యదర్శి బిజ్జి శత్రు తదితరులు

ముషీరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలని ఆలిండియా కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ కార్యదర్శి బిజ్జి శత్రు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం బీసీల రిజర్వేషన్ అమలుకు ఢిల్లీలో చేపట్టిన మహాధర్నా కార్యక్రమానికి ముషీరాబాద్ నుంచి కాంగ్రెస్ పార్టీ నేతలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా బిజ్జి శత్రు మాట్లాడుతూ... బీసీలకు న్యాయం చేసేవిధంగా అసెంబ్లీలో తీర్మానం చేసినప్పటికీ కేంద్రప్రభుత్వం రిజర్వేషన్‌లను అమలు చేయడంలేదని ఆరోపించారు. బీసీలు అన్నిరంగాల్లో వెనకబడి ఉన్నారని తమకు న్యాయం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే పార్లమెంటులో బీసీబిల్లు ప్రవేశపెట్టి అమలు చేయాలన్నారు. రిజర్వేషన్ బిల్లు అమలైతేనే త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. బీసీల పట్ల బీజేపీకి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే 42శాతం రిజర్వేషన్ కల్పించేవిధంగా నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, నగరఅధ్యక్షుడు రాజేందర్, కాంగ్రెస్ నాయకులు రాము, బాలు, బీసీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

భవానీ అమ్మవారు ప్రత్యేక దర్శనం

చిక్కడపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాస పూజల్లో భాగంగా మంగళవారం చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలోని భవానీ మందిరంలో అమ్మవారు భక్తులకు ప్రత్యేక అలంకారంతో దర్శనమిచ్చారు. ఫలాలతో ప్రత్యేకంగా అమ్మవారిని ఆలయ ముఖ్యఅర్చకులు బుగ్గా లక్ష్మీపతిశర్మ అలంకరించి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో మాచర్ల దేవనాథం, ఆలయ పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ జానకి సుధాకర్ పేర్కొన్నారు.



ఫలాలతో ప్రత్యేక అలంకారంలో భవాని అమ్మవారు

ప్రత్యేక అలంకారంలో నల్లపోచమ్మ అమ్మవారు

చిక్కడపల్లి యూనియన్ బ్యాంక్ లేన్‌లోని నల్లపోచమ్మ దేవాలయంలో అమ్మవారు శ్రావణ మంగళవారం సందర్భంగా ప్రత్యేక అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ నిర్వాహకులు భవాని శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రావణ మాసం సందర్భంగా నిత్యం ప్రత్యేకపూజలు జరుగుతున్నాయని భక్తులు పెద్దఎత్తున హాజరు కావాలని కోరారు.

శాకాంబరిగా అష్టైశ్వర్య లక్ష్మీదేవి..

నల్లకుంట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం రెండో మంగళవారం పురస్కరించుకుని నల్లకుంట డివిజన్ తిలక్‌నగర్‌లోని విశ్వసాయిబాబా ఆలయంలో అష్టైశ్వర్య లక్ష్మీదేవి శాకాంబరిగా భక్తులకు ప్రత్యేకదర్శనం ఇచ్చారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమాదేవిశ్యామ్‌రావు, భాగ్యరేఖ, తోట భవాని, రాంగోపాల్, ఉదయశ్రీ, సునీత, శ్రీలైజ, రజిత, సంతోషి, చంద్రకళ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలల్లో చెస్, వ్యాస రచన పోటీలు

రాంనగర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్వజన్ వికాస్ మంచ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చెస్, వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షుడు అనిల్‌కుమార్ తెలిపారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నగరంలోని అన్ని పాఠశాలల్లో ఈ నెల మొదటి వారంలో చెస్, వ్యాస రచన పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీలలో విద్యార్థులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.



మాట్లాడుతున్న సర్వజన్ వికాస్ మంచ్ సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షుడు అనిల్‌కుమార్

ట్రేడ్ లైసెన్స్‌ల రెన్యూవల్ పరిశీలన

అంబర్‌పేట సర్కిల్ పరిధిలోని హిమాయత్‌నగర్‌లో డీఎంసీ మారుతిదివాకర్ ట్రేడ్ లైసెన్స్‌ల రెన్యూవల్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. హిమాయత్‌నగర్‌లోని విజయా డయాగ్నస్టిక్‌లో ట్రేడ్ లైసెన్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎంసీ రవీందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- రాంనగర్, ఆంధ్రజ్యోతి



పరిశీలిస్తున్న డీఎంసీ మారుతిదివాకర్

సినీపరిశ్రమ కార్మికుల సమస్యలపై చర్చలకు రావాలి

తెలంగాణ ఫిలిం ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్

కార్మికశాఖ అదనపు కమిషనర్ గంగాధర్‌కు వినతి

చిక్కడపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సినీపరిశ్రమ కార్మికుల సమస్యలపై చర్చలకు ఫిలించాంబర్ సభ్యులు రావాలని తెలంగాణ ఫిలిం ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్‌కుమార్ అన్నారు. తెలుగు సినీ పరిశ్రమ ఫెడరేషన్ 24 యూనియన్‌ల ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని తెలంగాణ కార్మికశాఖ కమిషనరేట్ కార్యాలయంలో అదనపు కమిషనర్ డా.ఇ.గంగాధర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం అనిల్ కుమార్ మాట్లాడుతూ తెలుగు ఫిలిం ఇండస్ట్రీలో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు 30 శాతం పెంపుదల గురించి అదనపు కమిషనర్‌ను కలవడం జరిగిందన్నారు. అయితే కార్మిక కమిషనర్ కార్యాలయం వారు ఒక పర్సంటేజీ ప్రతిపాదన చేశారని దానికి తాము ఒప్పుకోలేదన్నారు. 30శాతం పెంచాల్సిందేనని తాము తమ అభిప్రాయాన్ని నిక్కచ్చిగా వెల్లడించామన్నారు. తాము కార్మికుల కష్టానికి ప్రతిఫలం అడుగుతున్నాం తప్ప ఎవరినీ దోచుకోవడం లేదని అది తమ ఉద్దేశం కాదని అన్నారు. సినీ రంగం బాగుంటేనే ప్రొడ్యూసర్లు, కార్మికులు బాగుంటారని అన్నారు. ఎవరికి ఇబ్బంది కలగకుండా వేతనాలు పెంచుకోవడమే తమ ఉద్దేశం అని స్పష్టం చేశారు. సంవత్సరానికి 10 శాతం పెంచుతామని మూడు సంవత్సరాల క్రితం హామీఇచ్చారని, అయితే ఇంతవరకు కార్మికులకు ఆ హామీని అమలు చేయలేదన్నారు. ఫిలిం ఇండస్ట్రీ కార్మికులకు 30 శాతం వేతనాలు పెంచాల్సిందే అని తాము ప్రతిపాదన చేశామన్నారు. కార్మిక శాఖ రాష్ట్ర అదనపు కమిషనర్ గంగాధర్ సమస్య పరిష్కారానికి ఇరువర్గాలతో చర్చిస్తున్నారని తెలిపారు. ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ సభ్యులు సినీ ఇండస్ట్రీ పెద్దలతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తారని ఎదురుచూస్తున్నామన్నారు. నేటితో సినీ ఇండస్ట్రీలో ఈ సమస్యపై ఉన్న సందిగ్ధత తొలగిపోతుందని ఆశిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రధానకార్యదర్శి అమ్మిరాజు, కోశాధికారి అలెగ్జాండర్ తదితర నాయకులు పాల్గొన్నారు.



అదనపు కమిషనర్ డా.గంగాధర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న అనిల్‌కుమార్ తదితరులు

చర్చలు జరుపుతున్నాం

చిక్కడపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కొన్ని రోజులుగా నెలకొన్న సమస్య పరిష్కారానికి గాను సినీ నిర్మాతలు, కార్మికులతో చర్చలు జరుపుతున్నామని కార్మిక శాఖ అదనపు కమిషనర్ డా.ఇ.గంగాధర్ తెలిపారు. మంగళవారం రాత్రి గంగాధర్ విలేకరులతో మాట్లాడారు. మంగళవారం మధ్యాహ్నం సినీకార్మిక యూనియన్ నేతలు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారన్నారు. ఈ సందర్భంగా వారితో సమస్యపై చర్చలు కొనసాగించినట్లు వివరించారు. వారు 30 శాతం వేతనాలు పెంచాలనే డిమాండ్‌తో కూడిన డిమాండ్ పత్రం అందజేశారని తెలిపారు. అయితే సినీ నిర్మాతల మండలి సభ్యులు ఇప్పటికే తమతో రెండుసార్లు చర్చలు చేసినట్లు తెలిపారు. మరోసారి వారిని చర్చలకు ఆహ్వానించినట్లు ఆయన తెలిపారు. సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు గంగాధర్ వెల్లడించారు.



నాలాలో మట్టి తొలగింపు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి, జీహెచ్‌ఎంసీ సిబ్బంది

నాలాలో మట్టిని వెంటనే తొలగించాలి

రాంనగర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల బాగ్అంబర్‌పేట డివిజన్‌లోని వర్షం నీటిని నాలాలో పేరుకుపోయిన మట్టిని వెంటనే తొలగించాలని కార్పొరేటర్ బి.పద్మా వెంకటరెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం డివిజన్‌లోని నాలాలో పేరుకుపోయిన మట్టి పనితీరును ఆమె పరిశీలించారు. మట్టి తొలగింపులో ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని సూచించారు.

టీజీఎన్‌ఎంవీఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా రజనీకుమార్

రాంనగర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నేతకాని మహర్ విద్యార్థి సంఘం (టీజీఎన్‌ఎంవీఎస్) హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా వీరెల్లి రజనీకుమార్ నేత నియమితులయ్యారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర నేతకాని మహర్ విద్యార్థి సంఘం సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు సాయినిప్రసాద్ నేత వీరెల్లి రజనీకుమార్ పేరు ప్రకటించి, నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేతకాని మహర్ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా ప్రొఫెసర్ జాడి ముసలయ్య, నాయకులు సాయినిప్రసాద్, ప్రతినిధులు రాజేష్, వినోద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రజనికుమార్‌కు నియామకపత్రం అందజేస్తున్న సాయినిప్రసాద్

42 శాతం బీసీ రిజర్వేషన్లను కేంద్రం ఆమోదించాలి

రాంనగర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత పార్లమెంట్ సమావేశంలోనే తెలంగాణ ప్రభుత్వం అమలుచేయాలని భావించిన 42 శాతం బీసీ రిజర్వేషన్లను కేంద్రం ఆమోదించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం విద్యానగర్‌లోని మార్క్స్‌భవన్‌లో జరిగిన సమావేశంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నేతలు సాధినేని వెంకటేశ్వరరావు, జె.వి.చలపతిరావు మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్‌లో చేర్చి అమలు చేయాలన్నారు. రిజర్వేషన్లను ప్రైవేట్ రంగంలో అమలుచేయాలని వారు డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న సాధినేని వెంకటేశ్వరరావు, జె.వి.చలపతిరావు

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి



మాట్లాడుతున్న సాధన స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ మురళీకృష్ణ

రాంనగర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సాధన స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ సీహెచ్.మురళీకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విద్యాహక్కు చట్టంపై రాష్ట్రస్థాయి సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక పోరాటాల ఫలితంగా బాలల ఉచిత నిర్బంధ చట్టం 2009లో వచ్చిందని, 2010 నుంచి ఈ చట్టం అమలు జరుగుతుందన్నారు. కానీ పూర్తిస్థాయిలో చట్టం అమలు కావడం లేదన్నారు. ఈ చట్టం 100 శాతం అమలు జరిగేలా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అందె వెంకటేశం, ఆర్.వెంకటరెడ్డి, ఎండి.సలీం, ఆంజనేయులు, నాగరాజు, రమేష్, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

- గాంధీనగర్ కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అశోక్‌నగర్ ఎస్‌బీహెచ్ కాలనీ అభివృద్ధికి, స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ హామీ ఇచ్చారు. ఆంధ్రజ్యోతిలో ఆదివారం 'మున్సిపల్ పార్కును అభివృద్ధి చేయాలి' అనే శీర్షికతో ప్రచురితమైన వార్తకు కార్పొరేటర్ స్పందించారు. ఎస్‌బీహెచ్ కాలనీవాసులతో కలిసి మంగళవారం కార్పొరేటర్ కాలనీలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీలో వెలగని స్ట్రీట్‌లైట్లు, గతుకుల రోడ్లు, రోడ్డుపై గుంతలతో ఇబ్బందికరంగా మారిందని కాలనీలోని ఎస్‌బీహెచ్ 3 పార్కును అభివృద్ధిపర్చి, కాలనీవాసుల కోసం ఓపెన్‌జిమ్‌ను ఏర్పాటు చేయాలని స్థానికులు కార్పొరేటర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అధికారులతో సమీక్షించి వెంటనే అభివృద్ధిపనులపై ప్రత్యేకచర్యలు చేపడుతామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు వి.నవీన్‌కుమార్, శివకుమార్, కాలనీ అధ్యక్షుడు ధనుంజయ, ఎం.సూర్యనారాయణ, మనోహన్, కిషోర్, రమేష్, విశ్వనాథ్, వెంకటేశ్, రెడ్డి, రామ్‌మోహన్, కాంబ్లే తదితరులు పాల్గొన్నారు.



సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ పావని

బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ

- రిజర్వేషన్ల పేరిట హిందూ ముస్లింల మధ్య చిచ్చు
- రాజ్యాంగబద్ధంగా అమలు చేయకుండా జాప్యం : ఆప్

కవాడిగూడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లను రాజకీయం చేయడానికి కాంగ్రెస్, బీజేపీ వాడుకుంటున్నాయని ఆమ్ ఆద్మీపార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బుర్ర రాముగౌడ్ ఆరోపించారు. బీసీలను కాంగ్రెస్, బీజేపీ మోసం చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. రిజర్వేషన్ల పేరిట హిందు ముస్లింల మధ్య చిచ్చు పెట్టేందుకు కుట్రలుచేస్తున్నారని, రాజ్యాంగబద్ధంగా అమలు చేయకుండా జాప్యం చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. మంగళవారం దోమలగూడలోని ఆమ్ ఆద్మీపార్టీరాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకెళ్లి ఏఐసీసీ ముఖ్య కార్యాలయంలో కాంగ్రెస్ నాయకుల ముందు తెలంగాణ సామాజిక కులగణన సర్వే 2024 నమూనా, పద్ధతిపై ఇటీవల ప్రజెంటేషన్ ఇచ్చారు కానీ సీఎం రేవంత్‌రెడ్డికి కులగణన సర్వే నివేదికను తెలంగాణ ప్రజాక్షేత్రంలో పెట్టడానికి ఎందుకు సమయం దొరకడంలేదని ప్రశ్నించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి కోసం బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ తెరపైకి తీసుకొచ్చిందన్నారు. బీసీ బిల్లును తెలంగాణలో కాంగ్రెస్, ఢిల్లీలో బీజేపీ ఫుట్‌బాల్ ఆడుకుంటున్నాయని కానీ న్యాయంచేయడం లేదన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ హైకోర్టు ఆదేశాల మేరకు సెప్టెంబర్ 30లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్‌చేశారు. బీసీలకు న్యాయంచేయాలనే చిత్తశుద్ధి ఉంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందడుగు వేయాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ ముసాయిదాను రాష్ట్ర గవర్నర్ ఆమోదించాలన్నారు. బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసేంతవరకు ఆమ్‌ఆద్మీపార్టీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆమ్‌ఆద్మీపార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆప్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రాముగౌడ్

చిన్నారెడ్డికి టీయూజేఏసీ వినతి

రాంనగర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు గుర్తింపు కార్డులు, అమరవీరుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాలని టీయూజేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు టీయూజేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి నేతృత్వంలో ఉద్యమకారులు ప్రజాభవన్‌లో మాజీమంత్రి జి.చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల సంక్షేమానికి వెయ్యికోట్లతో సంక్షేమ బోర్డును ఏర్పాటుచేయాలని ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించాలని కోరారు. అమరవీరుల పేరు మీద వంద ఎకరాల్లో స్మృతివనం నిర్మించాలని, మలిదశ ఉద్యమంలో అమరులైన కుటుంబాలలో ఆర్థిక సహకారం అందని వారికి 10 లక్షల నగదుతోపాటు ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ పథకాలలో 10 శాతం కోటా ఇవ్వాలన్నారు. జి.చిన్నారెడ్డి మాట్లాడుతూ ఉద్యమకారుల డిమాండ్లను సీఎం దృష్టికి తీసుకెళ్లి అమలు చేసేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు కె.రాజేంద్రప్రసాద్, డోలక్‌యాదగిరి, మోత్కురి మల్లేష్, గుండా యాదగిరి, విజయలక్ష్మి, శారద, సుగుణమ్మ, చంద్రకళ, శ్రీనివాస్, కోటేశ్వరరావు, స్వరూప, లక్ష్మి, చారి తదితరులు పాల్గొన్నారు.



మాజీమంత్రి చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న టీయూజేఏసీ చైర్మన్ సుల్తాన్‌యాదగిరి తదితరులు

'ఎంపీ ఈటలపై బురదజల్లడం అత్యంత దుర్మార్గం'

బర్కత్‌పుర, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమంలో ఆస్తులను సైతం అమ్మేసి ఉద్యమాన్ని నడిపిన మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌పై బురదజల్లడం అత్యంత దుర్మార్గమని తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్ అన్నారు. మంగళవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పేదవర్గాల అభ్యున్నతి కోసం ఎన్నో ఉద్యమాలు నడిపిన నాయకుడు ఈటల అన్నారు. ఈటలపై తప్పుడు ప్రచారం చేస్తే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పుట్టగతులు ఉండవని ఆయన విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం గతంలో అవినీతికి పాల్పడితే శిక్షించడానికి దమ్మూ ధైర్యం లేకనే ఈటల రాజేందర్‌పై నిందలు వేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని హితవుపలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈటలపై అవినీతి ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి కరుణాకర్, ఉపాధ్యక్షులు వెంకట్, గంగాధర్, సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ గోపీరాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నా : ఎమ్మెల్యే

గోల్నాక, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తాను నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్తున్నానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. మంగళవారం గోల్నాక డివిజన్‌లోని గంగానగర్, న్యూగంగానగర్ బస్తీలలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పర్యటించి ప్రజలను కలుసుకుని వారి యోగక్షేమాలను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మౌలిక సదుపాయాల గురించి ప్రజలతో చర్చించి అవసరమైన పనులను త్వరలో పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే ప్రజలకు భరోసా ఇచ్చారు. కొత్త పనులను కూడా త్వరగా శ్రీకారం చుట్టే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. తనకు నియోజకవర్గం అభివృద్ధి, ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆర్.కె.బాబు, రెడపాక రాము, మారుతి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా కొనసాగించాలి

ముషీరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ పరిధిలోని జెమినీ కాలనీ, శాస్త్రీనగర్, ఉదయ్‌నగర్‌లో గతంలో తాగునీటిని సరఫరా చేసిన మాదిరిగానే చేయాలని కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లాకార్యదర్శి తమగొండ రాజ్‌దీప్, సీనియర్ నాయకులు రామేష్ గౌడ్ జలమండలి అధికారులను కోరారు. మంగళవారం జలమండలి డీజీఎం మోహన్‌రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గతంలో సాయంత్రం 5గంటలకు మంచినీటి సరఫరా చేసేవారని ఆ సమయాన్ని మార్చి కొన్నిరోజులుగా రాత్రి 7గంటలకు నీటిని వదులుతున్నారని ఫిర్యాదుచేశారు. తద్వారా మహిళలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా నీటి సరఫరాను సాయంత్రం 5గంటలకు చేయాలని విజ్ఞప్తి చేశారు.



డీజీఎం మోహన్‌రాజ్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజల సహకారంతోనే శాంతిభద్రత పరిరక్షణ : డీఐ

ముషీరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారంతోనే శాంతిభద్రతల పరిరక్షణ సాధ్యమవుతుందని ప్రతిఒక్కరూ పోలీసులకు సహకరించాలని ముషీరాబాద్ డీఐ మహ్మద్ నదీమ్ కోరారు. మంగళవారం ముషీరాబాద్ డీఐ ఉమ్రాయాత్రకు వెళ్లి వచ్చిన సందర్భంగా మర్యాదపూర్వకంగా భోలక్‌పూర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా డీఐ మాట్లాడుతూ... దొంగతనాలు, గొడవలు జరగకుండా ప్రతి పౌరుడు పోలీసులకు సంపూర్ణ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముజీబ్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



ముషీరాబాద్ డీఐ మహ్మద్ నదీమ్‌కు సన్మానం

బోడేపూడి స్ఫూర్తితో రైతాంగం ఉద్యమించాలి

చిక్కడపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బోడేపూడి వెంకటేశ్వరరావు స్ఫూర్తితో రైతాంగం ఉద్యమించాలని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి టి.సాగర్ పిలుపునిచ్చారు. ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం బోడేపూడి వెంకటేశ్వరరావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి పూలమాలలతో నివాళులర్పించారు. రైతుసంఘం నేతలు ప్రొ.అరిబండి ప్రసాదరావు, జంగారెడ్డి, మూడ్ శోభన్, వెంకట్రాములు, శివకుమార్ పాల్గొన్నారు.

రేపు సాయిబాబా ఆలయం వద్ద అన్నదానం

చిక్కడపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బాగ్‌లింగంపల్లి షిర్డీసాయిబాబా దేవాలయం వద్ద గురువారం ఉదయం 11 గంటలకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక వైస్‌చైర్మన్ పెద్దోల్ల గంగారెడ్డి తెలిపారు. ఆలయం వద్ద అన్నదానం సౌకర్యం కోసం షెడ్డును నిర్మిస్తున్న దాతలు దాదాపు మూడువేల మందికి సాయిబాబాకు ప్రీతిపాత్రమైన రోజు గురువారం అన్నదానం చేస్తున్నట్లు వివరించారు.

'స్థానిక' ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం

నల్లకుంట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వర్గీకరణ పేరుతో మాలలను అణచివేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలను స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతిశ్రీకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రమాదంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి జీవంపోసి అధికారంలోకి తీసుకొచ్చేందుకు మాలలు అహర్నిశలు శ్రమించారన్నారు. తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ పేరుతో మాలలను తీవ్రఅన్యాయానికి గురిచేసిన కాంగ్రెస్ పార్టీని స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడించాలని ఆయన మాలలను కోరారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | అంజిరెడ్డి : 99859 21362